ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 5 డిసెంబరు 2025



ఆఖరి విడతలో రెండో రోజు 831 నామినేషన్లు

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది విడతలో గురువారం 831 నామినేషన్లు వచ్చాయి. 119 సర్పంచ్ స్థానాలకు 159 నామినేషన్లు.. 1,088 వార్డు స్థానాలకు 672 నామినేషన్లు దాఖలయ్యాయి.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ధర్మపురి	25	40	224	169
బుగ్గారం	10	23	96	112
ఎండపల్లి	15	21	138	90
వెల్గటూర్	19	33	168	122
గొల్లపల్లి	27	8	246	42
పెగడపల్లి	23	34	216	137
మొత్తం	119	159	1,088	672

అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

మల్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే డా.ఎం సంజయ్‌కుమార్ గురువారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని కోరుట్ల సీఐ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎన్నికలను పురస్కరించుకుని పోలీసులతో కవాత నిర్వహించారు. ఎన్నికల సంఘం విధించిన నిబంధనలు అభ్యర్థు లందరూ పాటించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతల సమస్య రాకుండా చూస్తామని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కథలాపూర్, మేడిపల్లి, కోరుట్ల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అందించాలి

బుగ్గారం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూతనందించాలని మండల అభివృద్ధి అధికారి సుమంత్, మండల విద్యాధికారి వెంకటే శ్వర్లు పేర్కొన్నారు. బుగ్గారం మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. దివ్యాంగులైన చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదలతో శ్రమించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కిషోర్, సిఆర్‌పి పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రచారం షురూ..



- క్షేత్ర స్థాయిలోకి సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు
- వాట్సాప్ గ్రూపుల్లో హామీలతో పాటు గుర్తులతో క్యాంపెయిన్
- తొలి విడత బరిలో 461 సర్పంచ్...1,954 వార్డు సభ్యుల అభ్యర్థులు

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం మొదలైంది. తొలి విడత ఎన్నికలు జరిగే మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపులు పూర్తి కావడంతో అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించారు. పలువురు అభ్యర్థులు ముఖాముఖిగా తలపడుతున్నారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లతో పనులు ప్రారంభించారు. కొందరు తమకు కేటాయించిన గుర్తులతో పాటు తమ ఫొటోలు ఉండే విధంగా భారీ బ్యానర్లు సైతం రెడీ చేసి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో, కాలనీల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం...

పంచాయతీ అభ్యర్థులు సోషల్ మీడియాల్లో తమకు కేటాయించిన గుర్తులతో పాటు ఎన్నికల్లో తమను గెలిపిస్తే చేసే పనుల చిట్టాను చక్కర్లు కొట్టిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ఇప్పటికే ఆయా గ్రామాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసుకుంటున్న వాట్సాప్ గ్రూప్‌లను ఇందుకు వేదికగా మలచుకొని ఆన్‌లైన్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కొందరు రీల్స్ సైతం చేస్తూ పంచాయతీల్లో గెలుపు కోసం విభిన్న పంథా అనుసరిస్తుండడంతో పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. పట్టణాలు, నగరాల్లో ఉన్న తమ పల్లె ప్రజలకు కూడా వాట్సాప్ ద్వారానే తమ గుర్తు, హామీలను పంపుతూ ఓట్లను అభ్యరిస్తూ నయా ట్రెండ్ సృష్టిస్తున్నారు. మరో ఐదు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఊర్లలో ఉన్న తమ బంధుగణంతో పాటు స్నేహితులతో గెలుపు మంతనాలు చేస్తున్నారు. కులాలు, యూత్ అసోసియేషన్ల వారీగా హామీలు ఇస్తూ సర్పంచ్ పీఠంతో పాటు వార్డు స్థానాలు గెలుచుకునేందుకు యత్నిస్తున్నారు.

గుర్తుల ప్రచారంపై స్పెషల్ ఫోకస్..

పంచాయతీ ఎన్నికల సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను ప్రచారంలో స్పెషల్ ఫోకస్ చేయడంపై దృష్టి సారించారు. ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టూత్ పేస్టు, చెత్తడబ్బా, నల్ల బోర్డు, బెండకాయ, బ్యాట్, టీవీ రిమోట్, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, మంచం, టేబుల్, బ్యాటరీ లైట్, బిస్కట్, వేణువు, చెప్పులు, గాలి బుడగ, క్రికెట్ స్టంప్స్ తదితర గుర్తులను గుర్తుంచుకోవాలంటూ సర్పంచ్, వార్డు అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. ఈ ప్రచారం అటు సోషల్ మీడియాలో ఇటు ప్రచారంలో హీట్ పుట్టిస్తోంది. కరపత్రాలు, వాల్ పోస్టర్లు, బ్యానర్లతోని పల్లెల్లో సందడి ఉంది. తొలి దశ ఎన్నికలు జరిగే మూడు మండలాల్లో ఈ ఆన్‌లైన్ ప్రచారం పతాక స్థాయికి చేరింది.

ఎక్కడెక్కడ ఎలా అంటే..

- ఈనెల 11వ తేదీన తొలి దశ ఎన్నికలు జరగనున్న మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో 122 సర్పంచ్ పంచాయతీలకు, 1,172 వార్డు సభ్యులకు స్థానాలకు గాను నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 461 మంది సర్పంచ్ పదవుల కోసం 1,954 మంది వార్డు పదవుల కోసంబరిలో నిలిచారు.
- ఈనెల 14వ తేదీన మలి విడత ఎన్నికలు జరిగే జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, రాయికల్, బీర్‌పూర్ మండలాలు, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో 144 సర్పంచ్, 1,276 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలు గడువు ముగిసే సరికి 941 సర్పంచ్...2,927 వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు

మిగతా 8వ పేజీలో..

హోంగార్డుల సేవలు అభినందనీయం

- ఎస్పీ అశోక్ కుమార్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా భద్రతలో హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం హోంగార్డ్ రైజింగ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ మొక్కలు నాటి మాట్లాడుతూ ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన, ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల నిర్వహణ వంటి విభాగాల్లో హోంగార్డులు ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, సైదులు, వేణు, రిజర్వ్ ఎస్ఐలు, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన తీరును ఖండిస్తున్నామని, వెంటనే ఆయన హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ మాట్లాడుతూ హిందూ దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేటి విజయ్, మర్రి నందకిషోర్, పన్నాల రాఘవరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీకర్ గౌడ్, తోకల సత్యనారాయణ, గంప శ్రీను, జంగుల అనిల్ గౌడ్, బొడ్ల నగేష్, తల్లోజి భాస్కర్, అరిగేల రాకేష్, బొడ్ల నరేష్ పాల్గొన్నారు.

‘పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ’



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. గురువారం హైద్రాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై పలు ఆదేశాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఎన్నికల జనరల్ పరిశీలకులు రమేశ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ అఫ్ కండక్ట్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ మరియు సహాయ కేంద్రంను (కంట్రోల్ రూమ్) ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఏవైనా సమస్యలుంటే, ఎన్నికలకు సంబంధించిన సమాచారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 9666234383ను సంప్రదించాలని తెలిపారు. నిరంతర సేవల కొరకు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.

- జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం జనరల్ అబ్జర్వర్ రమేష్‌తో కలిసి నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో ఈ రాండమైజేషన్ చేపట్టినట్లుగా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారులు రఘువరన్, మదన్మోహన్, రేవంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



అభివృద్ధి పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరు భాగస్వాములు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి నర్సింగ్ కళాశాల రోడ్డు నంబర్1 లో కోటి రూపాయలతో డ్రైనేజీ, 20 వ వార్డులో 20 లక్షల డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పట్టణంలో లేఅవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని, పట్టణ అభివృద్ధిలో ప్రజలు అధికారులు భాగస్వామ్యం కావాలని అన్నారు. మార్కండేయ నగర్ కు అనుసంధానంగా యావర్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. యావర్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో 9 వందల మీటర్ల చేర భవిష్యత్ తరాల కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. బైపాస్ రోడ్డు వంద ఫీట్ల మీద డ్రాఫ్ట్ తెస్తే ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారం చేసి ప్రజలను ఆగం చేశారన్నారు. మోతె చెరువు పునరుద్దరణ కు 3.5 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ స్పందన, డిఈ ఆనంద్, ముప్పాల రాంచందర్ రావు, గిరి నాగభూషణం, గొలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, అనుమల్ల కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని భీమారం ఎంఈవో మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట పీఎంశ్రీ మండల ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత చర్యలు పాటించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, శుభ్రమైన వాతావరణం అత్యంత కీలకమని తెలిపారు. అలాగే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవ చేయడానికి లయన్స్ క్లబ్ చక్కని వేదిక

రాయికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్ అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం, కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 157 మందికి కంటి పరీక్షలు చేయగా, 34 మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొడగం అంజిరెడ్డి, కోశాధికారి బెక్కం తిరుపతి, దయాబెటిక్ కో ఆర్డినేటర్ బత్తిని భూమయ్య, డీసీలు మ్యాకల రమేష్, కాటిపెల్లి రాంరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, కొమ్ముల ఆదిరెడ్డి, దాసరి గంగాధర్, కట్కం కళ్యాణ్, గంట్యాల ప్రవీణ్, కనపర్తి శ్రీనివాస్, మండలోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సర్పంచ్ అభ్యర్థి ధర్నా

- వీడీసీ సభ్యులు బలవంతంగా నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపణ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యామాపూర్ సర్పంచ్ అభ్యర్థి గోపాల్‌రెడ్డి

జగిత్యాల/మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవికి బలవంతంగా నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన ఎల్లాల గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశాడు. యామాపూర్ గ్రామ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నికను రద్దు చేయాలని తన మద్దతుదారులతో కలిసి గోపాల్‌రెడ్డి జగిత్యాల కలెక్టరేట్ ఎదుట, కోరుట్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాడు. అనంతరం కలెక్టర్‌కు, ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో భాగంగా తాను యామాపూర్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానన్నాడు. ఈనెల 3న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తన ప్రత్యర్థి కనుక నాగేష్‌లు పిలిచి సర్పంచ్ నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేశారని ఆరోపించాడు. ఎవరు రూ.4 లక్షలు ఇస్తే వారే సర్పంచ్ అని చెప్పారన్నారు. దీంతో తాను డబ్బులు ఇవ్వనని తెలపగా కనుక నాగేష్ 4 లక్షలు ఇచ్చాడన్నాడు. దీంతో తనను నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని లేదంటే గ్రామ బహిష్కరణ చేస్తామని బెదిరించడంతో విత్ డ్రా చేసుకున్నానని గోపాల్‌రెడ్డి పేర్కొన్నాడు. తనను నిర్బంధంగా విత్ డ్రా చేయించి సర్పంచ్ స్థానానికి 4 లక్షలు తీసుకున్న గ్రామభివృద్ధి కమిటీపైన, కనుక నాగేష్‌పైన ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఎన్నికల్లో వ్యయ పరిమితి పాటించాలి

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు వ్యయ పరిమితి పాటించాలని ఎన్నికల ఆడిటర్ నిజామోద్దీన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో అభ్యర్థులకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదు వేల జనాభా పైబడి ఉన్న గ్రామపంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు రు. 2.5 లక్షలు, ఐదువేలలోపు ఉంటే రు. 1.5 లక్షలు, వార్డు సభ్యులకు రూ. 50 వేలు, ఐదు వేల జనాభాలోపు ఉంటే రూ.30 వేలు వ్యయం చేయాల్సి ఉంటుందన్నారు. తమ ఖాతాలు సక్రమంగా నిర్వహించుకుని నిర్ణీత వ్యయం చేయాలనే నిబంధన పాటించాలని పేర్కొన్నారు. కొత్తగా తీసుకున్న ఖాతాల నుంచి ఖర్చులు చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంసీఓ మురళి, వివిధ గ్రామాల నుంచి సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా తూకం వేయాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

బీర్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మ్యాచర్ వచ్చిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తుంగూర్, రేకులపెల్లి కొనుగోలు కేంద్రాలను, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొల్వాయి, తాళ్ళధర్మారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుకు ఇబ్బంది కలుగకుండా మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకులు రాహుల్, ఐకేపీ సీసీ తిరుపతి తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మల్యాలలోని మాజీ జడ్పీటీసీ వీరబత్తిని శోభారాణి నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని అన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్ ఇంటికి వెళ్లారు. డీసీసీ అధ్యక్షునిగా నియమితులైనందుకు ఎమ్మెల్యేను సుదర్శన్ శాలువాతో సత్కరించారు. తమ పార్టీ తరుపున బలపరుస్తున్న అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని మాజీ సర్పంచ్‌తో ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, వీరబత్తిని ప్రతాప్, ఆగంతపు వంశీ, బట్టు విజయ్ తదితరులు ఉన్నారు.

కెనాల్ పూడ్చి మట్టి తరలింపు

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో ఎస్సారెస్పీ డీ 53 కెనాల్‌ను పూడ్చి మట్టి తరలించడం చర్చనీయాంశంగా మారింది. ఓ వ్యక్తి మట్టి తరలించడానికి ఎస్సారెస్పీ కెనాల్ అడ్డుగా ఉందని ఏకంగా కెనాల్‌ను పూడ్చి దారిని ఏర్పాటు చేసుకుని మట్టి తరలించాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలించడానికి కెనాల్‌ను పూడ్చడంపై తహశీల్దార్ శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నోడల్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి
- అదనపు కలెక్టర్ రాజాగౌడ్
8

ఘనంగా దత్తాత్రేయ జయంతి
- భక్తుల ప్రత్యేక పూజలు
7

నీవెంటే నేను..

- మొదట భార్య.. తర్వాత భర్త
- 24 గంటల వ్యవధిలో

వృద్ధ దంపతుల మృతి

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధదంపతులు 24గంటల వ్యవధిలోనే మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికిచెందిన కనకం రాజమల్లు(80), రాజవ్వ(73) అనేవృద్ధదంపతులు కొంత కాలంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధ వారం భార్య రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, భర్త రాజమల్లు గురువారం మృతిచెందాడు. 24గంటల వ్యవధిలోనే భార్యభర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో గురువారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. మ్యాన్‌రైడింగ్ చానల్స్‌కు మరమ్మతులు నిర్వహిస్తుండగా చక్రాలు ఊడిపోయి సునీంద్ర, మహేందర్‌రెడ్డి అనే జనరల్ అసిస్టెంట్ల చేతులపై పడడంతో చేతులకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన మహేందర్‌రెడ్డిని అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కరీంనగ ర్‌కు తరలించారు. ప్రమాదంపై అధికా రులు విచారణ జరుపుతున్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్ విచారణ

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపాదకాలనీలో కేసు విచారణ పేరిట జరిగిన అవమానభారంతో శీలం రాజ్‌కుమార్ అనేయువకుడు ఇంట్లో ఆత్మ హత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొం దుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మంథని ఎస్‌ఐపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గురువారం విచారణ జరిపినట్లు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్య నారాయణ తెలిపారు. శీలం రాజ్‌కుమార్ మృతిపై, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రమానవ హక్కు ల కమిషన్‌లో ప్రజాప్రయోజనార్థం మేర కు ఫిర్యాదుచేయగా కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సై రమేష్ వ్యక్తిగతంగా హాజరు కాగా విచారణ అనంతరం కేసును జన వరి 8కి వాయిదా వేసినట్లు తెలిపారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలకేం ద్రంలో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో అను మతులు లేకుండా నడుస్తున్న లారీ, ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే రోడ్లపైకి రావాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనబీమా చేయించాల న్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను రవాణా రంగానికి వినియోగించవద్దని సూచిం చారు. తనిఖీల్లో కానిస్టేబుల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరం రాయండి..

బహుమతి పొందండి



- రెండు విభాగాల్లో పోటీలు
- ఈ నెల 8 వరకు ఉత్తరాలు పంపేందుకు గడువు

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆధుని క సాంకేతికత పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో కనుమరుగవుతున్న పాత సంప్రదా యాలను మళ్లీ గుర్తు చేసేందుకు తపాల శాఖ సంకల్పించింది. బంధువులకు, మిత్రులకు, ప్రభు త్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ఏదైనా సమాచారం చేరవేయాలంటే ఉత్తరాలు రాసే వారు. ఇది 25 ఏళ్ల క్రితం నాటి ముచ్చట. గతంలో ఉత్తరాలు రాయడం కోసం పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్, కవర్ ఉపయోగించే వారు. ప్రస్తుతం సోషల్ మీడి యా ప్రభావంతో సమాచారం అందించేందుకు క్షణ కాలం కూడా పట్టడం లేదు. దీంతో కొన్ని ప్రభుత్వ సంస్థలు మాత్రమే తపాలా శాఖ సేవ లను వినియోగిస్తుంది. దీని కోసం తిరిగి ఉత్తరా లు రాయడాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో డాయీ ఆఖర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు లెటర్ టు మై రోల్ మోడల్ అంశంపై పోటీ నిర్వహిస్తోంది. ఈ అంశంపై వ్యాసాలు రాసి పంపాలని, ఈనెల 8వ తేదీ వరకు ఉత్తరాలను పంపించాలని కోరుతోంది.

ఎవరు, ఎలా రాయాలి..

తపాల శాఖ ఉత్తరాలు రాసే పోటీని రెండు విభాగాలు విభజించారు. 18 ఏళ్లలోపు విభాగం, 18 ఏళ్లు దాటిన వారు వ్యాసాలు రాసి పంపాల్సి ఉంటుంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రాయవచ్చు. ఇన్‌లాండ్ లెటర్‌లో వ్యాసం రాసే వారు 500 పదాలకు మించకుండా, కవర్‌లో రాసే వారు 1000 పదాలకు మించకుండా ఏ4 సైజ్ పేపర్‌లో చేతి రాతతో రాసి పంపాలి. టైప్ చేసి పంపితే అంగీకరించరు. వ్యాసంతో పాటు అభ్యర్థు లు తమ వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

తపాల సర్కిల్లో ఉత్తరాలు రాయడంలో విజేతలుగా నిలిచే వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందిస్తారు. జాతీయ విభాగంలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలు, తృతీయ రూ. 10 వేలుపంపిణీ చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సయ్యద్ అజారోద్దీన్, పోస్టల్ అధికారి, మంథని

ఉత్తరాల ద్వారా వ్యాసాలు రాసే పోటీని నిర్వ హిస్తూ తపాలా శాఖ వారు బహుమతులు అంది స్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియో గం చేసుకోవాలి. తమ లేఖలను ద చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, డాక్ సదన్, అబిడ్స్ హైదరాబాద్ 500001 చిరునామాకు ఈనెల 8వ తేదీలోగా పంపించాలి.

వైన్స్ ఏర్పాటు చేయవద్దని మహిళల రాస్తారోకో

- గ్రామ కార్యదర్శిని నిలదీసిన కాలనీవాసులు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలనీలో వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దని మండ లంలోని అయిలాపూర్ గ్రామ మహిళలు ఆందోళనకు దిగారు. వైన్స్‌కోసం షెడ్ నిర్మాణానికి ఎలా అనుమతిని ఇచ్చావని గ్రామకార్యదర్శిని నిలదీశారు. గురువారం మండలంలోని కోరుట్ల అయిలాపూర్ రోడ్డుపై అక్కడి కాలనీవాసులు ఆందోళనకు దిగి రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం మద్యం టెండర్లు నిర్వహించగా స్థానికంగా ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్ట ణానికి చెందిన వైన్స్ వ్యాపారులకు డ్రా ద్వారా దక్కిం చుకున్నారు. దీంతో వ్యాపారి అయిలాపూర్ నుంచి కోరుట్లకు వచ్చే రహదారిని ఆనుకోని ఉన్న ఓ స్థలంను లీజ్‌కు తీసుకోని షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన మహళలు వైన్స్ ఇక్కడ ఏర్పాటు చేయ వద్దని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. వైన్స్ ఏర్పాటుచేస్తే కాలనీలో ఉన్న మహిళలు ఇబ్బం దులుఎదుర్కొంటారని వైన్స్ ఏర్పాటుకు అనుమతిం చవద్దన్నారు. దీంతో కార్యదర్శి నవీన్ ఎక్సైజ్‌అధికారుల దృష్టికిసమస్యను తీసుకపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. కాగా అయిలాపూర్ వైన్స్ గెజిట్‌లో లేదని ప్రచారం జరుగుతోంది. అక్కడ ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి మార్చినట్లుగా సమాచారం.

అనుమతి లేని షెడ్.. ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్ హాల్ సీజ్

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ అధికారులు అనుమతి లేని షెడ్‌తో పాటు ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్‌హాల్‌ను సీజ్‌చేశారు. గురువారం పట ్టణంలోని నందిచౌరస్తా ప్రాంతంలో నూత నంగా నిర్మించిన షెడ్‌కు నిర్మాణ అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో మెట్‌పల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ రూ.14లక్షలు పెండింగ్‌లో ఉండంగా సీజ్‌చేసినట్లు మున్సి పల్ కమిషనర్ తెలిపారు.



ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జీపీవో సస్పెన్షన్.. కేసు నమోదు

- రికార్డులో భూవిస్తీర్ణం పెంచి.. మరొకరి పేరు చేర్చిన వైనం

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూరికార్డులో భూవిస్తీర్ణం పెంచి, మరొకరి పేరు చేర్చి అక్రమంగా భూపట్టా చేసిన మండలంలోని బల్వంతాపూర్ జీపీవో ఈ ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాటిపల్లికి చెంది ధర్మవ్వకు చెందిన సర్వేనంబర్ 290/9లో అయిదు ఎకరాల భూమి ఉండగా భూమి పహనిలో భూవిస్తీర్ణం మరో 2.20ఎకరాలకు పెంచి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి జీపీవోపై సస్పెన్షన్ వేటువేశారు. ధర్మవ్వ పహానీల కోసం దరఖాస్తు చేసుకోగా పెంచిన భూవిస్తీర్ణంను 2.20ఎకరాలను జవ్వాజి జలజ పేరిట నమోదు చేసినట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వ రికార్డులు, పహానీలను ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో తహసీల్దార్ వసంత ఫిర్యాదు మేరకు జీపీవో ప్రవీణ్, జలజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

తల్లిదండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజుల జైలు

జగిత్యాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జేఎఫ్‌సియం కోర్టు న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణం గంజ్ స్ట్రీట్‌కు చెందిన వయోవృద్ధులైన మండలోజు సత్య వతితోపాటు ఆమెభర్త బాగోగులు చూసుకో కుండా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయమని తన కొడుకు రమేష్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని 2021లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కిషోర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ కరుణాకర్ సూచనల మేరకు హెడ్ కాని స్టేబుల్ ఏ రాజేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ బి. రాజేష్ బాధితురాలు తరుపున వాదించారు. సాక్ష్యాలు పరిశీలించి, విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ నిందితుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కొండలరాయుడి కోటపై నుంచి దూకిన యువకుడు

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపైన గల కొండలరాయుడి కోటనుంచి మతిస్థిమితంలేని వ్యక్తి దూకగా తీవ్రగాయాలతో బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దునూరు మండలం జాలపల్లికి చెందిన యాసవేణి ధీరజ్ అనే యువకుడు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు వారంరోజుల క్రితం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొండపైన ఉంటున్న మతిస్థిమితం సరిగాలేని ధీరజ్ గురువారం ఆలయం వెనకాల గల కొండలరాయుడి కోట బండరాళ్ల వద్దకు వెళ్లి లోయలోకి దూకాడు. గమనించిన అక్కడున్న కొందరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డులు రాజేశ్, వెంకటేశ్, సెక్యూరిటీ గార్డు కుమార్ కొంతమంది భక్తులు కలిసి అతన్ని లోయ నుంచి బయటకు తీసుకువచ్చారు. ధీరజ్‌కు వెనుక వైపులో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కొంగుకు నిప్పంటుకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వాసాల పద్మ(85) అనే వృద్ధురాలి చీరకొంగుకు నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన కూతురు వకుల ఇంటికి వచ్చిన పద్మ చలికాలం ఎండ కోసం గ్యాలరీ పక్కన ఉన్న కుర్చీలో కూర్చోంది. పక్కన తులసిచెట్టు వద్ద దీపం వెలిగించి ఉండగా ప్రమాదవశాత్తూ వృద్ధురాలి చీర కొంగు దీపంపై పడి మంట అంటుకుంది. ఘటనలో పద్మ తీవ్ర గాయాల పాలు కాగా కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలిం చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

తండాలో పోలీసుల సోదాలు

- 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..
- 10 లీటర్ల సారా స్వాధీనం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు జరిపారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వచేసిన 80లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనపర్చుకు న్నారు. తయారీదారులు నేమీ, కవితపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..



గంగిపల్లిలో రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంత

మానకొండూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిప ల్లిలో తాగునీటి పైపు లైన్ కోసం రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేయ డంతో ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చివేయాలని కాలనీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు. గంగిపల్లి ఎస్సీకాలనీ, కొండప ల్కలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ నిర్మాణం కోసం గుంత తవ్వి వదిలేశారు. సింగిల్ తారు రోడ్డు కావడంతో పెద్ద వాహనం వెళ్లే సమయంలో స్థలం సరిపోక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, గుంత పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని కోరారు.

రానున్న వేసవికి పటిష్ట కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

- అధికారులతో సమీక్షలో ఎస్ఈ మేక రమేష్‌బాబు



విద్యుత్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ అధికా రులకు సూపరింటెండింగ్ ఇంజనీర్ కరీంనగర్ మేక రమేష్‌బాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సమా వేశమందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగాఉండాలని ఏఈలకు, ఏడీలకు సూచించారు. ఎక్కడైతే పవర్ ట్రాన్స్ఫా ర్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఓవర్‌లోడ్ అయ్యే అవకాశం ఉందో అక్కడ అదనపు సామర్థ్యం పెంపుదల ట్రాన్స్ఫార్మర్ పెట్టాలని ఆదేశించారు. 33కేవీ, 11కేవీ లైన్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉన్నచోట కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వినియోదా రులకు అంతరాయం లేకుండా 33కేవీ, 11కేవీ మెయింటెనెన్స్ చేయాలన్నారు. వ్యవ సాయ సర్వీస్ అప్లికేషన్లు 15 రోజుల్లోపు సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలని, గృహ, వాణిజ్య మీటర్లు ఏడు రోజుల్లోపు రిలీజ్ కావాలని ఆదేశిం చారు. 1912ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వెం టనే పరిష్కరించాలని ఆదే శించారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పొలంబాట, పల్లెబాట, బస్తీబాట, పట్టణబాట నిర్వహించి వినియోదారు లకు అవగాహన సదస్సు నిర్వహించి విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా అవ గాహన కల్పించాలని ఆదేశించారు. సమా వేశంలో డీఈలు కే ఉపేందర్, రాజం, లక్ష్మ రెడ్డి, ఎం తిరుపతి, ఎస్ఏవో రాజేంద్ర ప్రసాద్, ఏవోలు, ఏఏవోలు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొ న్నారు.

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు వివిధ కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే..

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



రజనీకాంత్(ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ -పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికిచెందిన జక్కు రజనీకాంత్(31) అనేవ్యక్తి కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఏడా దిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది బిజిగిరి షరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో మద్యా నికి బానిసై ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సం ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలి పిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన సద్ది రాజిరెడ్డి(40) భార్య కొన్నేళ్లక్రితం చనిపో యింది. రాజిరెడ్డి డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగి స్తున్నాడు. కొద్దిరోజులుగా పనిలేకపోవడంతో మద్యానికి బానిసైన రాజిరెడ్డి ఒంటరితనంతో మనస్థాపంచెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడితల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకున్న యువకుడు



అరవింద్(ఫైల్)

పెగడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెగడ పల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్(23) అనేయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకాలని సూచించగా మన స్థాపంతో ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా రాత్రి చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



అంజవ్వ(ఫైల్)

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో జరిగింది. గ్రామ స్థుల, చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన నేదూరి అంజవ్వ(55) అనే మహిళకు భర్త పోశయ్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం హార్వెస్టర్ కొనుగోలు చేయగా ఆర్థికంగా నష్టపోయారు. హార్వెస్టర్ విక్రయించిన అప్పులు తీరలేదు. వ్యవసాయంలో వచ్చిన నష్టంతో పూర్తిగా దివాళా తీశారు. దీంతో అప్పులి చ్చినవారు చెల్లించాలని కోరారు. ముగ్గురుకుమారులు పట్టించుకోకపోవ డంతో తీవ్రమనస్థాపానికి లోనైనా అంజవ్వ ఇంట్లో ఉరివేసుకుంది. భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం



జితేందర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాన్ని దున్నేందుకు గురువారం కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ వెనుక నాగళ్లపై వేసుకుని వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండ లం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం జితేందర్(36) దుర్మరణం పాల య్యాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. జితేందర్ గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతూ జీవిస్తున్నాడు. పొలాన్ని దున్నేం దుకు ట్రాక్టర్ వెనుకఉన్న నాగళ్లపై కేజ్‌వీల్స్ వేసుకుని వెళుతున్న క్రమం లో ఒక్కసారిగా కేజ్‌వీల్స్ ఎగిరి కిందపడ్డాయి. దీంతో జితేందర్ వాహనం వెనుక వైపునకు చూడడం వల్ల ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో బోల్తాపడింది. చుట్టుపక్కల రైతులు గమనించి ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయను తీసేందుకు యత్నించారు. మరోట్రాక్టర్ సహాయంతో బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. అప్పటికే జితేందర్ చనిపోయాడు. మృతుడికిభార్య దివ్య, కొడుకు విశాల్, తల్లి లక్ష్మి ఉన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామశివారులో ఈనెల29న రోడ్డుప్రమాదంలో గాయపడిన లక్ష్మణ్‌రావు (36) అనేయువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. ఈనెల29న రాత్రి సమ యంలో ముత్తునూర్ గ్రామానికిచెందిన గొల్లకల్యాణ్, కొత్తపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ ఢీకొ న్నారు. ఈ సంఘటనలో లక్ష్మణ్‌రావు తలకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో గురు వారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య సహజ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కువైట్‌లో ముస్తాబాద్‌వాసి మృతి



వేదుల్(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎండీ వేదుల్(36) కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. వేదుల్ నాలుగు నెలలక్రితం ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుప త్రిలో చికిత్సపొందుతూ పరిస్థితివిషమించి మృతి చెందాడు. వేదుల్‌కు భార్య షబానా, ఇద్దరు పిల్లలున్నారు. పేదకుటుం బానికి చెందిన వేదుల్ మృతదేహం స్వగ్రామం చేరేలా చూడాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఎండపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లకోట గ్రామంలో గురువారం రోజున కుక్కలదాడిలో 12మేకలు మృతిచెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమరగొండ దివాకర్ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మేపడానికి వెళ్లాడు. అనా రోగ్యంతో నడవలేని కొన్ని మేకలను గూటిలో వేసి మిగతా వాటితో వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా కుక్కలుమేకలపై దాడిచేసి చంపాయి. వాటివిలువ సుమారు లక్షపైగా ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని దివాకర్ వేడుకుంటు న్నాడు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు గంగాధర విద్యార్థి


అస్లాం

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి అస్లాం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్ 14 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన అస్లాం అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయినట్లు పీడీ తెలిపారు. ఈ నెల 5 నుండి 7 వరకు భద్రాది కొత్తగూడెం జిల్లా హస్నాపురంలో జరగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఎంపీడీవో రాము, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఈర్ల శ్రీజ

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థి ఈర్ల శ్రీజ అండర్ 19 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విద్యార్థి శ్రీజ ప్రాతినిధ్యం వహిస్తోంది. శ్రీజను ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టులో గిరి ప్రదక్షిణ


మల్యాల, డిశంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ గురువారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానార్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప దీక్షాపరులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. చినజీయర్‌స్వామి శిష్య బృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంతకౌశిక్, వివేక్ స్వామిలే వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యతో పాటు భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలు కఠినం



పాటించకపోతే పదవీ గండం

మూడేళ్ల పాటు పోటీలకు దూరం

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమ నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అభ్యర్థులు తెలిసీ తెలియక వాటిని ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభ్యర్థులు తమ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసిన రోజు నుంచి పక్కాగా లెక్కలు పరిగణనలోకి వస్తాయి. రూపాయి రూపాయి లెక్క చేస్తారు. ఎవరు చూస్తున్నారంటూ నిర్లక్ష్యం చేస్తే గెలిచాక పదవి ఊడిపోతుంది. దీంతో పాటు మరో మూడేళ్ల పాటు ఏ ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హత విధిస్తారు. అందుకుని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసే ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి తప్పకుండా తెలుపాలి.

అయితే ఎన్నికలకు సంబంధించిన ఖర్చులన్నీంటినీ కొత్త బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన లావాదేవీ లన్నింటినీ ఆ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాలి. ప్రతీ అభ్యర్థి తన గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఎన్నికలు ముగిసిన 45 రోజుల లో తనకు సంబంధించిన ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి.

ఒకవేళ గెలిచిన అభ్యర్థులు ఆ సంబరంలో సకాలంలో ఖర్చు వివరాలను అధికారులకు ఇవ్వడం మరిచిపోతే పదవి కోల్పోవడంతో పాటు మూడేళ్ల అనర్హత వేటు పడుతుంది.

మర్చిపోకుండా ఎన్నికల ఖర్చు వివరాలను గెలుపు ఓట ములతో సంబంధం లేకుండా నిర్ణీత గడువులోగా అధికారులకు సమర్పించాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న అన్ని ఖర్చులను ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన నిఘా బృందాలు గమనిస్తూ ఖర్చును అంచనా వేస్తుంటాయి. నిఘా బృందాలు రికార్డు చేసిన ఖర్చు మొత్తాన్ని కూడా అభ్యర్థుల పేరుతో నమోదు చేస్తాయి. సాధ్యమనంత వరకు ఎన్నికల వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చులు చేస్తూ వాటిని నమోదు చేసుకోవాలి.

అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు వివరాలు

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి గ్రామ జనాభా 5 వేల లోపు ఉంటే లక్షా 50 వేల రూపాయలు, వార్డు స భ్యుడికి పోటీ చేసే అభ్యర్థి 30 వేలు, 5 వేల జనాభా దాటితే 2.50 లక్షల రూపాయలు, వార్డు సభ్యుడు అభ్య ర్థి 50 వేల రూపాయ లకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల గెలుపు కోసం రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చును అభ్యర్థుల ఖాతా ల్లోనే జమ చేస్తారు.

అభ్యర్థుల ఖర్చుపై ఎప్పటికప్పుడు సర్వైవల్ టీమ్స్, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియోలు, ఫొటోల చిత్రీకరణ చేసి ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థులు చేసిన ఖర్చుకు సంబంధించి తక్కువ చేసి లెక్క లు సమర్పించినప్పుడు వీడియోలు, ఫొటోలను పరిశీలించి సరి చేస్తారు. ఎన్నికల కోసం వాడే ప్రచార సామగ్రి, తదితర వాటికి ఎన్నికల సం ఘం ధరలు నిర్ణయించింది. ఆ ధరల ప్రకారమే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చూపాల్సి ఉంటుంది. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యాడ్జీలు, వాల్ రైటింగ్స్, నమూనా బ్యాలెట్లు, తదితర ముద్రించి ఓటర్లకు పంపిణీ చేస్తారు. ప్రచారానికి మైకులు, లౌడ్ స్పీకర్లు వినియోగిస్తుంటారు. వీటన్నింటికీ ఎన్నికల సంఘం ధరలు నిర్ణయించింది.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 6,892 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అడ్మిట్ కార్డులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 6లోగా చొప్పదండిలోని నవోదయ విద్యాలయంలో సరిచేయించుకోవాలన్నారు. మార్పులు ఏవైనా ఉనట్లయితే సంబంధిత ఆధార పత్రాలు తీసుకొని విద్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి చేస్తుందని, భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యమని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో సంఘం 71వ జాతీయ మహాసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఏబీవీపీ ఉద్యమాలు, విజయాలు, రావాల్సిన మార్పులపై చర్చించామన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి చిప్ప యోగేష్, వంశీ,శివ , ఆకాష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పది సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలు, బడా పెట్టుబడుదారులైన అంబానీ, ఆదానీలు వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని, కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక దేశంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి అబద్ధాలు చెపుతున్నాడని అన్నారు. బీఎస్ఎన్ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. బ్యాంకులను ప్రైవేటుపరం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై జ్యుడీషియల్ ఎక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పచ్చని కొబ్బరిచేలను చూసి తెలంగాణ వారి కళ్లు మండుతున్నాయనడం ఆయన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిదర్శనమన్నారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాలు పచ్చని పొలాలతో విలసిల్లుతున్నాయన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 73, 74 రాజ్యాంగ సవరణ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనవరి 7న శబరిమలకు ప్రత్యేక రైలు

పెద్దపల్లి, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు జనవరి 7వ తేదీన మరో ప్రత్యేక రైలు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నంబర్ 07133 నాందేడ్ నుంచి ఉదయం 4:25 గంటలకు బయలుదేరుతుంది.. కోరుట్లకు 8:30 గంటలకు, జగిత్యాలకు 9 గంటలకు, కరీంనగర్‌కు 10 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 10:50 గంటలకు చేరుకోనున్నది. ఇక్కడి నుంచి 11:40 గంటలకు బయలు దేరి జమ్మికుంట 12:20, వరంగల్‌కు మధ్యాహ్నం 1:18 గంటలకు, తిరుపతికి రాత్రి 1:20 గంట లకు, కొల్లాం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07134 కొల్లాం నుంచి ఉదయం 2:30 గంటలకు బయలు దేరి, నాందేడ్‌కు మరుసటి రోజు సాయంత్రం 5:30 గంటలకు చేరుకోనున్నది.

అరటి సాగుపై రైతులు దృష్టిసారించాలి


అరటి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారులు

జగిత్యాలరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్ని అందించే అరటి సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జి.శ్యాం ప్రసాద్ రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో పండిస్తున్న అరటి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి మొక్కలు నాటుకోవడానికి అనువైన సమయమని అన్నారు. టిష్యూకల్చర్ అరటి మొక్కలు తెచ్చి నాటుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. బిందు సేద్యం ద్వారా నీరు అందిస్తే కలుపు సమస్య తక్కువగా ఉండి అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ ఉద్యాన అధికారి కె. స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ ఉన్నారు.

వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి సీఎం అన్యాయం


మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించి మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్లు లేకుండా గొంతు కోశాడని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం అంబేద్క ర్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాలను రిజర్వేషన్లు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో వేయి పోస్టులకు మాల సామాజిక వర్గానికి 28 పోస్టులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు చేస్తుంటే కాంగ్రెస్‌లో ఉన్న మాల సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కళ్లు మూసుకున్నారన్నారు. మాల సామాజిక వర్గం సత్తా చాటకపోతే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి పాటించి ఉండే మాల సామాజిక వర్గానికి ఏడు శాతం రిజర్వేషన్లు వచ్చేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్‌చందర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్, కో కన్వీనర్ జక్కుల యాదగిరి, స్టూడెం ట్ జేఏసీ చైర్మన్ మాదాసి రాహుల్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్, జిల్లా నాయకులు బూర యాదగిరి, బొల్లం గణేష్, పాటి రాజ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యంలో కోతపై రైతుల ఆందోళన

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో రాయపట్నం రహదారిపై కాట్నపల్లికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో కోత విధించారని రైస్ మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. ధాన్యం నాణ్యంగా ఉన్నప్పటికీ 42 కిలోల బస్తా తూకం వేసి పంపినప్పటికీ అదనంగా మరో కిలో కోత విధించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు రైతులతో మాట్లాడగా శాంతించారు.

డిపో మేనేజర్లతో సమావేశం

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో గురువారం రీజినల్ మేనేజర్ బి రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబరు మాసాంతం వరకు అన్ని డిపోల పనితీరు, పరమాదాలు నివారణ చర్యలు, రానున్న మేడారం జాతర ఏర్పాట్లు, శబరిమలై ప్యాకేజీ టూర్లు, యాత్రాదానంకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


ఎయిర్‌పోర్ట్ అథారిటి అధికారులతో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

జ్యోతినగర్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటు స్థల పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు బానోతు శ్రీనివాస్ తదితర బృంద సభ్యులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ కలిశారు. ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో ఎమ్మెల్యే వారిని కలిసి చర్చించారు. ప్రతిపాదిత 977 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించగా, గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఫిజిబిలిటి రిపోర్టు తయారు చేస్తున్నామని, అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లా ప్రాంత ప్రజలకు, పారిశ్రామిక ప్రాంతాల్లోని అధికారులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు విషయంలో చురుగ్గా ఉందని,పెద్దఎత్తున ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



అలంకరణకు ముందు వరదవెల్లి దత్తాత్రేయ స్వామి, వ్రతంలో పాల్గొన్న భక్తులు


ధర్మపురిలో దత్తాత్రేయ స్వామి

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 27 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ధర్మపురి గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయంలో..

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం గుట్టపైకి వెళ్లేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదు బోట్లను ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. అనంతరం గుట్ట కింద సామూహిక సత్య దత్త వ్రతాలను నిర్వహించారు. గురుపూజ, హారతి, రాత్రి దత్తాత్రేయస్వామి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు


స్థల పరిశీలన చేస్తున్న బానోతు శ్రీనివాస్

పాలకుర్తి/అంతర్గాం డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు స్థలాన్ని గురువారం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సర్వే చేశారు. కమ్యునికేషన్స్, నావిగేషన్స్, సర్వేలైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బానోతు శ్రీనివాస్, ఇతర అధికారులు హాజరయ్యారు. 977 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. అనంతరం గోలివాడ, ముర్మూరు పంపుహౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్, స్పిన్నింగ్ మిల్లు, రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్థలం అనుకూలంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ తూము రవిందర్ పటేల్, సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జనవరి 28 నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర

ఉమ్మడి జిల్లాలో 60కి పైగా ప్రదేశాల్లో ఏర్పాట్లు


పెద్దపల్లి జిల్లా గోయల్‌వాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి 28 నుంచి నిర్వహించనున్న సమక్కసారలమ్మ జాతర, అధికారుల వివరాలు, శాఖాపరమైన సూచనలను ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 60కి పైగా, అందులో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 31 చోట్ల జాతర కొనసాగనుంది. ఆయా జాతరల నిర్వాహకులు, అధికారులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జాతర అధికారులు వీరే...

- కరీంనగర్ జిల్లాలో..

హుజూరాబాద్, వావిలాలకు కె.సుధాకర్, జూపాక (హుజూరాబాద్)కు కె.సుభద్ర, ఇల్లందకుంట (మల్యాల), తనుగుల (జమ్మికుంట)కు కె.మోహన్, రేకుర్తి (కొత్తపల్లి)కి ఎ.మారుతి, చింతకుంట (కొత్తపల్లి), కొండపల్కల (మానకొండూరు), కొత్తపల్లి (తిమ్మాపూర్)కు ఎస్.అనిల్‌కుమార్, కేశవపట్నం (శంకరపట్నం), సైదాపూర్‌కు డీవీ మారుతీరావు, వీణవంక, కేశవాపూర్ (జమ్మికుంట), చల్లూరు, కోరుకల్ (వీణవంక)కు జి.రాజయ్య.

- జగిత్యాల జిల్లా : ధర్మపురికి డి.కిరణ్
- పెద్దపల్లి జిల్లాలో...

కొలనూరు, మడక (ఓదెల), కొదురుపాక, తొగర్రాయి (సుల్తానాబాద్), మీర్జంపేట, పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్), హన్మంతుని పేట (పెద్దపల్లి)కి బి సదయ్య, నీరుకుళ్ళ, గర్రెపల్లి (సుల్తానాబాద్), ఎలిగేడు, తెలుకుంట్ల (జూలపల్లి)కి ఎం.శంకరయ్య , గోదావరిఖని, ఈసలతక్కళ్ళపల్లి (రామగుండం), గుండారం (కమాన్‌పూర్)కు కె.కాంతారెడ్డి, గోయల్‌వాడ (రామగుండం)కు కె.రాజ్‌కుమార్.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు



- నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టాం. అన్ని శాఖలు, జాతర కమిటీలు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలి.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. గురుపౌర్ణమి పురస్కరించుకుని స్వామివారి సన్నిధికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు సీతారాంశర్మ నేతృత్వంలో కళ్యాణం కమనీయంగా నిర్వహించగా భక్తులు కనులారా వీక్షించారు. మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సింగిల్ నామినేషన్లు దాఖలైన జగిత్యాల మండలం చర్లపెల్లి, బీర్‌పూర్ మండలం గోండుగూడెం గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిశారు.

●జగిత్యాల నియోజక వర్గం బీర్‌పూర్ మండలం గోండుగూడెం గ్రామ పంచాయతీకి ఏకగ్రీవంగా ఎంపికయిన పాలక వర్గం గురువారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు జీవన్ రెడ్డిని కలువగా జీవన్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు.

సంజీవ్‌కు డాక్టరేట్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదూరు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బూరం సంజీవ్‌కు టొలాసో మెక్సికో యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు గురువారం ప్రకటించింది. బూరం సంజీవ్ గత కొన్నేళ్లుగా జర్నలిస్టుగా తన సేవలను నిర్వర్తిస్తూ పలు కథనాలు ప్రచురించి, అనేక సమస్యలపై స్పందించినందుకు జర్నలిస్టు విభాగంలో డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. ఈ అవార్డును మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 14న యూనివర్సిటీ అధ్యాపకులు అందించనున్నారు.

విజేత యూత్ కార్యవర్గం

రాయికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో విజేత యూత్ స్పోర్ట్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మామిడాల నాగరాజు, ఉపాధ్యక్షునిగా ఏనుగు రాజారెడ్డి, కార్యదర్శిగా చిట్టెటి ప్రతాప్ రెడ్డి, కోశాధికారిగా చిట్టేటి రఘునందన్ రెడ్డిలను ఎన్నుకున్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పూర్వ ప్రాథమిక విద్యా విధానంలో రూపొందించిన బోధనా పద్ధతులు, కృత్యాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన మండలంలోని తాండ్ర్యాల ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం గుండు విజయ్‌ను గురువారం రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ సన్మానించారు.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన బోధనా పద్ధతులు విజయవంతం కావడంతో పాటు ఆ విధానాలు 90శాతం ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన మాడ్యూల్‌లో విజయ్ తయారు చేసిన పద్ధతులను చేర్చారు.

నోడల్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నోడల్ అధికారులు సమన్వయంతో ఎన్నికల విధులను నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రమేష్‌లు జిల్లా నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆయా విభాగాలకు చెందిన నోడల్ అధికారులకు తగు సూచనలు చేస్తూ, సమన్వయంతో విధుల నిర్వహణ మరియు చేపట్టాల్సిన బాధ్యతాయుత పనులను తెలియజేశారు. జిల్లా నోడల్ అధికారులు ఎన్నికల విధులను పారదర్శకంగా, జవాబు దారితనంతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. అలాగే మొదటి విడత ఎన్నికలు జరిగే ఏడు మండలాల ఎంపీడీవోలకు ఎన్నికల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిపివో రఘువరన్, జిల్లా నోడల్ అధికారులు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కంట్రోల్ రూం పరిశీలన

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల ఎంసీసీ, కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీ కేంద్రాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్ కమిటీ), ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ రూమ్, కంట్రోల్ రూమ్ మరియు ఫిర్యాదు కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఫిర్యాదులకు తక్షణ ప్రతిస్పందన అవసరమని మరియు ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరిగేలా మోడల్ ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయాలని తెలిపారు. ఫిర్యాదు రిజిస్టర్లు, డాక్యుమెంటేషన్ మరియు రియల్-టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లను సమీక్షించారు. ఈ పరిశీలనలో డీపీవో రఘువరన్, నోడల్ అధికారి పి.నరేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



బందోబస్తును పరిశీలిస్తున్న సీఐ నీలం రవి

కోరుట్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్థులు సహకారం అందించాలని కోరుట్ల సిఐ సురేష్ బాబు కోరారు. గురువారం మండలంలోని పైడిమడుగు, మాదాపూర్ గ్రామాలలో కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ ఎస్‌ఐలు చిరంజీవి, రామచంద్రుడు, నవీన్, శ్రీధర్ రెడ్డిలు వారి సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ బాబు మాట్లాడారు. గ్రామస్థులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

పెగడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎన్నికల సంఘం నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మల్యాల సీఐ నీలం రవి పేర్కొన్నారు. మూడవ విడుత ఎన్నికలు జరుగనున్న పెగడపల్లి మండలంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని గురువారం సీఐ రవి సందర్శించి బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రవి విలేఖరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలు సమావేశాలు నిర్వహించ రాదని, కోడ్ ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టకూడదని, సరైన పత్రాలు లేకుండా పెద్ద మొత్తంలో డబ్బు తీసుకెళ్లినా సీజ్ చేయడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ ఉన్నారు.

చెస్‌లో ప్రతిభ

కొడిమ్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో సికింద్రాబాదులోని పల్లవి మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తెలంగాణ జట్టు క్రీడాకారుడు ఆయుష్ యాదవ్ కాంస్య పతకాన్ని సాధించినట్లు రాష్ట్ర చెస్ జట్టు మేనెజర్, కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఫీజికల్ డైరెక్టర్(పీడీ) బూట్ల రాజమల్లయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 27నుండి 30వరకు త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తాలో నిర్వహించిన (ఎస్‌జీఎఫ్) చాంపియన్ షిప్ పోటీల్లో ఆయుష్ యాదవ్ బోర్డు ప్రైజ్ వ్యక్తి గత విభాగంలో కాంస్య పతకాన్ని జాతీయ చెస్ పోటీల చీఫ్ అర్బిటార్ ప్రణబ్‌కుమార్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నట్లు వివరించారు. ఆయుష్‌యాదవ్ కాంస్య పతకం సాధించడం పట్ల కోచ్ మట్టయ్య, మేనెజర్ రాజమల్లయ్య హర్షం వ్యక్తం చేసారు. కాంస్య పతకాన్ని అందుకున్న క్రీడాకారునికి తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ ఎ.ఉషారాణి, జగిత్యాల డీఈవో కె. రాము, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.చక్రధర్‌రావు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న తుది విడత నామినేషన్ల పర్వం

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో మూడవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ రెండవ రోజు గురువారం కొనసాగింది. మండలంలో మొత్తం 25 సర్పంచ్‌లకు గాను 40 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 224 వార్డు సభ్యుల స్థానాలకు గాను 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రెండవ రోజు నామినేషన్ దాఖలు గడువు ముగిసే వరకు మొత్తం 71 మంది సర్పంచ్ అభ్యర్థులు, 221 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు.

పెగడపల్లి మండలంలో 171 నామినేషన్లు

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో గురువారం రెండో రోజు 171 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో ఇ.ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. 23 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ పదవికి 34 నామినేషన్లు, 216 వార్డు స్థానాలకు 137 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మొత్తంగా రెండు రోజులలో సర్పంచ్ పదవికి 76, వార్డు స్థానాలకు 214 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

ఎండపల్లి మండలంలో 111 నామినేషన్లు

ఎండపల్లి: పంచాయతీ ఎన్నికలలో ఎండపల్లి మండలంలో మొదటి విడతకు సంబంధించి రెండో రోజు భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. పోటీ చేసే అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుంటూ నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులు మొదటి రోజు 15 మంది, రెండవ రోజు 21 మంది రెండు రోజులు కలిపి 36 నామినేషన్లు, వార్డు సభ్యులకు మొదటి రోజు 43 రెండవ రోజు 90 మొత్తం రెండు రోజులకి 133 వచ్చినట్లు ఎంపీడివో దొండ కృపాకర్ తెలిపారు. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ ఎండపల్లి క్లస్టర్‌లోని నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పటిష్ట భద్రత ఏర్పాటు చేసామన్నారు. వారి వెంట సీఐ రాం నర్సింహరెడ్డి, ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మొదటి విడతలో నామినేషన్లకు శుక్రవారం సాయంత్రం గడువు ముగియనుంది.

వెల్గటూర్ మండలంలో 155 నామినేషన్లు

●**వెల్గటూర్:** వెల్గటూర్ మండలంలో గురువారం 19 సర్పంచ్ స్థానాలకు 33 నామినేషన్లు దాఖలయ్యాయి. 168 వార్డులకు గాను 122 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో వెంకట ప్రసాద్ తెలిపారు. కాగా ఇప్పటి వరకు మొత్తం సర్పంచ్ స్థానాలకు 48, వార్డు స్థానాలకు 153 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో వెంకట ప్రసాద్, ఎస్సై ఉదయ్ కుమార్ పరిశీలించారు.

బుగ్గారం మండలంలో 135 నామినేషన్లు

●**బుగ్గారం:** బుగ్గారం మండలంలో గురువారం 10 సర్పంచ్ స్థానాలకు 23 మంది, 96 వార్డు స్థానాలకు 112 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో సుమంత్ తెలిపారు.

గొల్లపల్లి మండలంలో నామినేషన్లు

●**గొల్లపల్లి:** గొల్లపల్లి మండలంలో మొత్తం 27 సర్పంచ్ స్థానాలకు గురువారం 8 నామినేషన్లు వచ్చాయని ఎంపీడీవో రవీందర్ రావు తెలిపారు. 246వార్డు స్థానాలకు 42 నామినేషన్లు దాఖలయ్యాయి. తిర్మలాపూర్ (పీడీ) నామినేషన్ స్వీకరణ కేంద్రంలో మొత్తం 30మంది అభ్యర్థులకు టోకెన్‌లు ఇవ్వగా ముహూర్తం పేరిట సాయంత్రం 5గంటల అనంతరం అభ్యర్థులు కేంద్రంలోకి ప్రవేశించడంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆలస్యమైంది.

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



కిషన్‌రావుపేటలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని అందంగా అలంకరించి శావపై నిలిపి అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కిషన్‌రావుపేట, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారి గోవింద నామాలు జపిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

జగిత్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొప్ప నాయకుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కొణిజేటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని కొనియాడారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తో పాటు రోడ్లు భవనాల రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా, విద్యుత్ శాఖ మంత్రిగా, హోమ్ మినిస్టర్, వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించారని, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా పని చేశారని తెలిపారు. మహనీయుల ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్ లత, రాజా గౌడ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎస్సారెస్పీ కాలువ భూమి కబ్జా

-అక్రమంగా భవనం నిర్మాణం -పట్టించుకోని సంబంధిత అధికారులు

గొల్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె రెవెన్యూ పరిధిలో కొన్నేళ్ల క్రితం ఎస్సారెస్పీ కాలువ భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేసి భవనం నిర్మాణంతో పాటు ప్రహరీ నిర్మించి కాలువ నీరు కింది ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆయకట్టు కింది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 2019 సంవత్సరంలో పది ఎకరాల ప్రైవేట్ భూమిని రైతుల నుంచి పలువురు కొనుగోలు చేశారు. అనంతరం అక్రమార్కులు పట్టా భూమిని ఆనుకొని ఉన్న ఎస్సారెస్పీ భూమిని సైతం అందులో కలుపుకుని భవనం నిర్మాణంతో పాటు అక్రమంగా ప్రహరీ నిర్మించారని గ్రామస్థులు, రైతులు ఆరోపిస్తున్నారు.



ఎస్సారెస్పీ కాలువను ఆక్రమించి నిర్మించిన గోదాం

●**ఎస్సారెస్పీ భూమి ఆక్రమణ**

ఎస్సారెస్పీ కాలువ వెంట రెండు వైపులా 30 ఫీట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుంది. రైతులు, ఎడ్లబండ్లు పోవడానికి ఖాళీ స్థలం ఉండాలనేది ఎస్సారెస్పీ నిబంధనలు చెబుతున్నాయి. అయితే, నిబంధనలను తుంగలో తొక్కి గోదాం యజమానులు ఎస్సారెస్పీ కాలువతో పాటు స్థలాన్ని తమ పట్టా భూమిలో కలుపుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా వారు ఆక్రమించుకున్న స్థలంలో కాలువలు నామరూపాలు లేకుండా తవ్వేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా భవనం నిర్మాణంతో పాటు ప్రహరీ నిర్మించినట్లు గ్రామస్థులు ఆరోపించారు. దీంతో పాటు పై నుంచి కింది వరకు ఆక్రమించిన కాలువను తొలగించి పైపులు వేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆరేళ్ల కిందట కొంత ఎస్సారెస్పీ భూమిని ఆక్రమించి గోదాం నిర్మించారు. భవనం నిర్మాణంతో పాటు గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ప్రహరీ ఎలా నిర్మిస్తారని పలువురు రైతుల ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఎస్సారెస్పీ కాలువ ఆక్రమణపై ఆర్టీఐలో దరఖాస్తు చేసినట్లు సమాచారం. అయితే దీనికి స్పందించిన ఎస్సారెస్పీ డీఈ స్పందన సంఘటనా స్థలాన్ని పరిశీ లించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ఎస్సారెస్పీ భూమిని స్వాధీన పర్చుకుని కింది ఆయకట్టు ప్రాంతాలకు సాగు నీరు సక్రమంగా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారులకు నివేదించాం

-స్పందన, ఎస్సారెస్పీ డీఈ

ఇస్రాజ్‌పల్లె గ్రామ రెవెన్యూ పరిధిలో గోదాం నిర్మాణంలో ఎస్సారెస్పీ కాలువ కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చింది. దీంతో ఇటీవలే తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించాం. మాతో పాటు రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ పాల్గొన్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు నివేదించాం.

మండల వైశ్య సంఘం అధ్యక్షుడిగా ఆశ్విన్

మల్లాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల వైశ్య సంఘ అధ్యక్షుడిగా సోమ ఆశ్విన్‌కుమార్ గురువారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. మల్లాపూర్ వాసవిమాత ఆలయంలో జరిగిన సంఘ ఎన్నికల్లో అశ్విన్‌కుమార్ ఒక్కరే నామి నేషన్ సమర్పించారు. దీంతో సోమ ఆశ్విన్‌కుమార్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు.

'లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు'

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప వైద్యాధికారి ముస్కు జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేసిన ఆయన స్కానింగ్ సెంటర్‌లలో పేషంట్‌ల సౌలభ్యం కోసం కనీస వసతులు, వెంటిలేషన్ సౌకర్యం వెయిటింగ్ హల్ నిబంధనల ప్రకారం ఉన్నాయా అని తనిఖీలో చూశారు. స్కానింగ్ మిషన్ మరియు డాక్టర్‌ల అర్హత ధృవీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధానాన్ని సరిపోల్చారు. లింగ నిర్ధారణ చేసే తీసుకునే చట్టరిత్యా చర్యలను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట హెల్త్ ఎడ్యూకేటర్ కటుకం భూమేశ్వర్ తదితరులు ఉన్నారు.

ప్రచారం షురూ

(ఐదో పేజీ తరువాయి)

దాఖలు చేశారు. ప్రస్తుతం నామినేషన్లపై అప్పీళ్ల స్వీకరణ, అప్పీళ్ల పరిష్కారం అధికారులు నిర్వహిస్తున్నారు.

● ఈనెల 17వ తేదీన మూడో దశ ఎన్నికలు జరిగే ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోని ధర్మపురి, గొల్లపల్లి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూరు, గొల్లపల్లి పెగడపల్లి మండలాల్లో 119 సర్పంచ్, 1,088 వార్డు సభ్యుల స్థానాలున్నాయి. నామినేషన్ల స్వీకరణ తొలి రోజు అయిన ఈనెల 3వ తేదీన 152 మంది సర్పంచ్ అభ్యర్థులు, 299 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.

సర్పంచ్ బరిలో తోడి కోడళ్లు

మల్లాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామ సర్పంచ్ పదవికి తోడి కోడళ్ల పోటీలో ఉన్నారు. వనతడుపుల శ్యామల, మమతలను తోడి కోడళ్ల సర్పంచ్ స్థానానికి పోటీపడుతున్నారు. ఈ గ్రామంలో నలుగురు బరిలో ఉన్నారు.

ఒకే ఇంటి నుంచి సర్పంచ్ బరిలో ముగ్గురు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో ఒకే ఇంటి నుంచి సర్పంచ్ స్థానానికి ముగ్గురు బరిలో నిలిచారు. నామినేషన్లు వేసిన పుల్ల పుష్పలత(భార్య), పుల్ల సాయగౌడ్(భర్త), పుల్ల వెంకటేష్(కొడుకు) పోటీలో ఉన్నారు. జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ బరి కోసం 12 మంది నామినేషన్లు వేశారు. అయితే సర్పంచ్‌ను ఏకగ్రీవం చేయడానికి గ్రామ పెద్దలు ప్రయత్నాలు చేయగా గ్రామంలో వివాదం నెలకొంది. దీంతో సర్పంచ్ అభ్యర్థులు బలవంతంగా విత్‌డ్రావలు చేసుకోవద్దని సూచించడంతో ఒకే ఇంటి నుంచి నామినేషన్లు వేసిన పుల్ల పష్పలత(భార్య), పుల్ల సాయగౌడ్(భర్త), పుల్ల వెంకటేష్(కొడుకు) పోటీలో ఉన్నారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట సర్పంచ్ బరిలో నలుగురు ఉండగా అందులో ఒకే పేరుతో ఉన్న తోడికోడళ్ల నోముల లక్ష్మి-రమేష్, నోముల లక్ష్మి-గంగాధర్‌లు ఉండడంతో గ్రామంలో చర్చశంగా మారింది. అందుకు అభ్యర్థులు తమ పేరుతో కాకుండా ఎన్నికల సంఘం కేటాయించిన ఒక గుర్తుతో కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.

హోరెత్తిన పంచాయతీ ప్రచారం

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పంచాయతీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిపోయి అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన నేపథ్యంలో పల్లెల్లో మైకుల మోత మోగుతోంది. మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను రాజారాం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ పదవితో పాటు 3 వార్డులు ఏకగ్రీవమయ్యాయి, 188 వార్డులకు గాను 31 ఏకగ్రీవం కాగా మిగిలిన 157 వార్డులకు 418 మంది అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. 18 సర్పంచ్ పదవులకు 83 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

వరుసగా 32 ఏళ్ల పాటు సర్పంచ్‌గా రంగారావు



మల్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం లోని పోతారంకు చెందిన కొండపల్కుల రంగారావు వరుసగా 32 ఏళ్ల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. మొదటగా 1957 నుంచి 1963 వరకు ఉప సర్పంచిగా చేసిన రంగారావు తరువాత 1963 నుంచి 1995 వరకు వరుసగా పోతారం సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. అంతకు ముందు 1963 నుంచి 1981 వరకు రంగరావు సర్పంచ్‌గా వార్డు సభ్యులచే ఎన్నికయ్యారు. పిమ్మట 1981 నుంచి 1995 పోతారం జనరల్‌కు రిజర్వ్ కావడంతో సర్పంచ్‌గా కొనసాగారు. 1995లో రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలులోకి రాగ పోతారం సర్పంచ్‌గిరి బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో రంగరావు సర్పంచ్ పదవికి దూరమయ్యారు. కాగ గత పదేళ్ల కాలంలో పెద్ద కోడలు ఇదే గ్రామంకు సర్పంచ్‌గా, చిన్న కొడుకు రామ్మోహన్‌రావు మల్యాల జడ్పీటీసీగా పనిచేశారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

-ఎన్నికల జిల్లా పరిశీలకుడు మనోహర్



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మనోహర్

కోరుట్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్నికల జిల్లా పరిశీలకుడు మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో ఖర్చు, నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ క్లస్టర్‌ల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకులు



కలశం నీటితో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమిని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయా దేవాలయం, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంతో పాటు సాయి బాబా మందిరంలో శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ జయంతిని పురస్క రించుకొని పలువురు 11 రోజుల క్రితం దత్తాదీక్షలు స్వీకరించగ మాల వితరణ చేశారు. సాయిబాబా మందిరం, శ్రీ భక్త మార్కండేయ మందిరంలో 108 మంది భక్తులు, అయ్యప్ప దీక్షా స్వాములు వారం రోజుల పాటు గురు చరిత పారాయణం చేశారు. ముగింపు రోజు అయిన గురువారం దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో భక్తులు దత్తాత్రేయ స్వామి మూల విరాట్టుకు స్వయంగా పంచామృతంలతో అభిషేకించారు. జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం ఆయా ఆలయాలలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్త మార్కండేయ ఆలయ అధ్యక్షులు బొగ గంగాధర్, ప్రధాన కార్యదర్శి గాదాసు రాజేందర్, బోగ రాజు, మ్యానపురి మహేష్, కొక్కుల ప్రభాకర్, చిలుక రాజన్న, వేద పండితులు తిగుళ్ల విషుశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు మేడిపల్ల శ్రీనివాస్ శర్మ, ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని సాయిరాం దేవాలయంలో గురువారం దత్త జయంతి వేడుకలను ఘంగా నిర్వహించారు. దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపిని వేదపండితులు రమేష్, కిరణ్, వినయ్‌లు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అభిషేకం కొరకు భక్తులు కలశం నీటితో శోభయాత్ర యాత్ర నిర్వహించి దత్రాతేయుడికి అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని ఓం శ్రీసాయి దివ్య మందిరంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. దివ్య ఆలయం 13వ వార్షికోత్సవంతో పాటు గురువారం పౌర్ణమి పురస్కరించుకుని ఆయలంలోని ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు అర్చనలు, తదితర పూజలు జరిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఓంకార జెండా ఆవిష్కరణ, దత్తాత్రేయ, సాయి, గణపతి విగ్రహాలకు పంచామృత అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డితో పాటు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిజ్జారపు నవీన్, వీడీసీ అధ్యక్షుడు పుర్రె రమేష్, నాయకులు మాకునూరి గంగాధర్, గంగుల బలరాం, పాలెపు రాజన్న, గుంటుక కైలాష్, పాలెపు సత్యనారాయణ, పురోహితుడు మునుగోటి రవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.